# భిక్షుకుడు

కథకుడు:
వి. వేంకటనరసింహారావు

వేసవికాలమది. సూర్యుడు తీక్ష్ణముగా ప్రకాశిస్తూ తన ప్రతాపాగ్నిని ప్రపంచానికి ప్రదర్శిస్తున్నాడు. ఎండ మిక్కుటముగ నున్నది. మిట్టమధ్యాహ్న సమయము. రోడ్ల మీద మానవ సంచారమేలేదు. పక్షులు వేడినిట్టూర్పులవిడుస్తూ జాలికరమైన చూపులతో చూస్తూన్నాయి. కుక్కలు నాలుకలను తెరచి తాపముతో నిట్టూర్పుల నిగుడుస్తూ పందిళ్లలోను, చెట్ల నీడలలోను పడుకొని వున్నాయి. ప్రతిప్రాణికూడ తహతహ లాడి పోతూవుంది.

ధనవంతులు వట్టివేళ్ల తడికల చాటున వారి నౌకరులు తడికలను నీళ్లతో తడుపుతూ వుండగా చల్లని పరిమళ పానీయములు త్రాగి నిద్దరపోతూవున్నారు. వారికీ బయటి ప్రపంచముతో పనేమున్నదిప్పుడు? బీదలు తమ తమ గృహములలోను, చెట్లక్రింద వడగాలిలోనే పడుకొనివున్నారు.

షుమారు ఒంటిగంట అవుతుంది. నేను మాఇంట్లో పడకకుర్చీలో పడుకొని "ఒథెల్లో" చదువుతున్నాను. "అయాగో" కుతంత్రమువల్ల ఒథెల్లో చేయబోవుచున్న దారుణకృత్యాన్ని చదవగా, దానినిగురించి అనేకవూహాలు నామనస్సులో గిర్రున తిరిగి పోతూవున్నాయి. అలాగే ఆ పుస్తకమును పట్టుకొని ఆలోచిస్తూవున్నాను. ఇంతలో "అమ్మగారూ! కాస్తంత అన్నం పెట్టించండమ్మా చచ్చిపోతున్నాను ఆకలితో..." అని ఒక దీనాలాపము వినపడింది. బయటికి వెళ్లి చూసాను—వృద్ధుడైన ఒకానొక భిక్షుకుడు. అతడు కర్ర సహాయంతో ఒణుకుతూ నిలబడి వున్నాడు. కాలువలుకట్టి చెమట ఆతని శరీరమునుండి పారుతూవుండగా, ఒకసంచి ఆతని భుజాన్నుండి వ్రేలాడుతూవుంది. అతని వెనుకనే ఆతనికుక్క జాలిగా నిలబడివుంది.

నన్నుచూసి ఆతడు "కాస్త అన్నం పెట్టించండి బాబూజీ. మూడు పూటలనుండీ కూడ గంజినీళ్లయినాలేవు" అన్నాడు.

"ఇంట్లో ఎవరూలేరు అన్నం పెట్టడానికి. ఒక అర్ధణాయిస్తా తీసికొనివెళ్లు"మని నేననగానే అంగీకారాన్ని చూపాడు. నేను అర్ధణాయివ్వగా అతడు "Thank you, sir" అని కృతజ్ఞత తెల్పాడు. నెమ్మదిగాకాళ్లీడుచుకుంటూ వెళ్లిపోయాడు. కుక్క తన యజమానుడ్ని అనసరించింది.

"పాపం! ఎంతోవృద్ధుడు. మూడు పూటలనుంచీ గంజినీళ్లేలేవట. ఎంత దీనమైన స్థితి. ఇటువంటిస్థితిలో ఆతనికి ఒక కుక్క కూడాను. అతను సంపాదించుకొన్న రొట్టెముక్కలో దానికికూడ భాగం. ఇంగ్లీషుముక్కలుకూడ రెండునేర్చుకుంటూవున్నారు యిటువంటివాళ్లు యిప్పుడు" అని అనుకుంటూ అలాగే కుర్చీలో నిద్రపోయాను.

నిద్రలేచేసరికి నాలుగు గంటలయింది. ......ఇంతలోనే అయిందయింది. అప్పుడప్పుడే జనసంచారం ఎక్కువవుతోంది. అట్లా గ్రంథాలయానికి అక్కడనుంచి పార్కుకీ వెడదామని బయలుదేరాను. అనేక రకాలమంది రోడ్లమీద వెడుతున్నారు. ఒకరికి మరొకరికి సంబంధంలేదు. జట్కావాళ్ల సందడి, రిక్షా వాలాల గంటలమోతలు, సైకిళ్ల గణగణ మంటూన్న గంటలమోతలు, ఇంకా ఎన్నో ఆరోడ్లమీద వున్నాయి.

నెమ్మదిగా స్టేషన్ దగ్గరకు వచ్చేసరికి అక్కడొక పెద్దగుంపువుంది. అందరు "పాపం! పాపం!" అంటున్నారు. 'ఏమిటా' అని నేనూ గుంపులో దూరాను. చూసా. ఏముంది? మధ్యాహ్నము కనపడ్డ బిచ్చగాడే ఇతడు. వడదెబ్బవల్ల ఆతని ప్రాణపక్షు లెగిరి పోయాయి. తన యజమాని మరణానికి దుఃఖిస్తూ ఆతని కుక్కమాత్రం ఆతని ప్రక్కనే వుంది. అది ప్రతి మానవహృదయాన్ని కరిగించివేసే దృశ్యము.

ఆతని సంచీలోనుంచి ఒక తెల్లకాగితముల పుస్తకమును ఎవరో ఒకరు తీసారు టంతకిముందు. అదిచూస్తే...... అందులో ఎటువంటి అత్యద్భుతమైన గీతాలున్నాయి. అవన్నీ మానవుని ప్రబోధిస్తూ వ్రాసిన విషాదగీతాలు. ఆతడు కవికాబోలు—అవును!

జీవించివుండగా ఎందరిటువంటికవులు ప్రపంచంలో గుర్తింపబడకుండా పోవటం లేదు? వారి అమూల్యమైన రచనలు నశించి పోవటంలేదు?

బట్టలు శుభ్రము చేయుటకు యిది చాలా మంచి సబ్బు.




యీ సబ్బు ప్రతి చోటా దొరకును.